# కళ్లు

సూర్యనారాయణగారిల్లు మార్కెట్‌కి దగ్గరగానే ఉంటుంది. మార్కెట్‌లో పనులన్నీ చూసుకున్నాక ఒక సారి వాళ్ళింటికి వెడదాం అనుకున్నాను. వాళ్ళు మాకు దూరపు బంధువులు. చూసి చాలా రోజులైంది. గేటు దగ్గర స్కూటర్ ఆపాను. ఇల్లు గేటుకి లోపల దూరంగా ఉంటుంది. హారన్ వాయించాను రెండు సార్లు. ఎవరూ ఇవతలికి రాలేదు. ఎవరైనా ఉన్నారో లేదో అనుకుంటూ గేటు తీసుకుని లోపలికి వెళ్ళాను.

ఇవతల వరండాలో ఎవరూ లేరు. కర్టెన్ తీసుకుని లోపల అడుగు పెట్టాను. రాధ ఎవరో కుర్రాడితో మాట్లాడుతోంది. ఇద్దరూ ఎదురెదురుగా ఉన్నారు. నిలబడే ఉన్నారు.

''అట్లాగే అన్నయ్య రాగానే చెప్తాను!'' అంటోంది.

''ఓ మీరా!'' అంది, నన్ను చూసి, తడబాటు లేదు.

నేను ఆ అబ్బాయినే పరికించి చూశాను.

ఇప్పటి యువకుల్లాగే బెల్స్, ప్రింటెడ్ షర్ట్ ధరించాడు. చెంపల దాకా, వెనక మెడమీద పడుతూ జుట్టు. మనిషి కొంచెం నాజూక్కి వ్యతిరేకంగా కనిపిస్తున్నాడు. శరీరం లావుగా, చూపులు మందంగా ఉన్నాయి.

''సరే నేను వెళ్ళివస్తాను'' అన్నాడా అబ్బాయి రాధనే చూస్తూ.

''ఊ'' అంది రాధ. స్కూటర్ వచ్చినప్పుడు, హారన్ వినిపించలేదా? ఏ లోకంలో ఉన్నారు? వాళ్ళిద్దరి మధ్యా ఏదో ఉంది అనిపించింది నాకు. అతను వెళ్ళిపోయాడు.

''కూర్చోండి. అమ్మా నాన్నగారూ ఇప్పుడే వచ్చేస్తారు. సండే కదా తిరగటానికి వెళ్ళారు.'' అంది.

కూర్చున్నాను. రాధ కూడా ఎదురుగా కొంచెం దూరంగా ఉన్న కుర్చీలో కూర్చుంది. ఇదివరకు రాధని చూసినా అంత బాగా చూడలే దనిపించింది. చామనఛాయలో కనుముక్కు తీరు బాగుండి రాధ చక్కగానే ఉంటుంది. కానీ కళ్లు చూపులు వాలిపోతున్న ట్లుంటాయి. ఆ కనురెప్పలు రహస్యాల్ని దాచు కుంటున్నట్లుంటాయి. ఆ కళ్లు ఒక్క భావాన్నే ప్రకటించగలవు... వాంఛ... అనిపించింది. నాకు కొంచెం భయం వేసింది.

ఇప్పుడే కాదు అరుదుగా కనిపించే అటువంటి కళ్లున్న మనిషిని చూస్తే... నాకు, అది భయమే అనుకుంటాను.

''బేబీకి మాటలు వచ్చాయా?'' అని అడిగింది రాధ సన్నటి వేళ్ళతో మెడలోని లాకెట్‌ని పట్టుకుని, ఆడుతూ.

''ఇప్పుడే అమ్మ, అత్తా, తాతా అంటోంది'' అన్నాను.

బేబీ మా అమ్మాయి. ఏడాది వెళ్ళింది దానికి. బేబీకి అన్నీ వాళ్ళమ్మ పోలికలే వచ్చాయి.

కళ్ళుకూడా ఇందిర కళ్ళే. అసలు ఆ కళ్ళని చూసే ఇందిరని చేసుకోటానికి ఒప్పుకున్నాను. నన్ను ఒప్పించింది ఆ కళ్లే. ఆ కళ్లు నన్ను మోసం చెయ్యవు. ఆ కళ్లు రహస్యాలని దాచవు, దాచలేవు. ఆ కళ్ళలో రకరకాల భావాలు పొంగి పొరలుతాయి... ప్రేమ, కరుణ, మమత చిలిపితనం, అనురాగం... కోపం, నిరసన కూడా... అప్పుడప్పుడు. ఇవన్నీ చూశాను. ఇందిరని వదులుకోలే ననిపించింది.

బేబీకి కూడా అటువంటి కళ్లే ఉండటం, నాకెంతో తృప్తినిచ్చింది.

నాకు భావాల్ని దాచుకునే కళ్ళంటే భయం. కనురెప్పల క్రింద నీలి నీడల్ని కురిపించే కళ్ళు నాలో అలజడిని కలిగించి, మనశ్శాంతి పోగొడతాయి. ఆ చూపుల్ని నేను భరించలేను అనిపిస్తుంది. కంపరంగా ఉంటుంది.

రాధ ఏవో సంగతులు చెప్తుంటే, ఐదు నిమిషాలు గడిచాయి.

వాళ్ళమ్మ నాన్నగారు వచ్చారు.

''బహుకాలదర్శనం. మామీద ఏమిటిలా దయ కలిగింది!'' అంటూ ఆప్యాయత కురిపించారు సూర్యనారాయణగారు.

''రావాలని అనుకుంటానండి. తీరిక ఉండదు. ఈ సారి ఇందిరను, బేబీని తీసుకుని తప్పకుండా వస్తాను,'' అన్నాను.

రాధ కాఫీ తెచ్చి ఇచ్చింది.

''మీ చలపతికి సంబంధాలు చూస్తున్నారా? బాగా కట్నం కావాలేమో!'' అంది రాధ తల్లి. నవ్వి ఊరుకున్నాను.

* * * *

మర్నాడే నాన్నగారి దగ్గర నుంచి ఆ ఉత్తరం రావటం నాకు ఆశ్చర్యం కలిగించింది.

''సూర్యనారాయణగారు బంధువులే కదా, వాళ్ళకి పెళ్ళీడు అమ్మాయి ఉందని, బి.ఎ. పాసయిందని తెలిసింది. పిల్ల కూడా బాగుంటుందనే మీ అమ్మ అంది. ఆ అమ్మాయిని మన చలపతికి చేసుకుంటే బాగుంటుందను కుంటున్నాం. నీ అభిప్రాయం వెంటనే రాయి' అని రాశారు నాన్నగారు. స్టంట్ సన్నివేశంలో నేపథ్య సంగీతంలా నా గుండె చప్పుళ్ళు చెయ్యటం ప్రారంభించింది.

చలపతి నా తరువాతవాడు. తమ్ముడు. ఇంజనీరింగ్ పాసయి, యమ్.యి. కూడా ఫస్టుగా పాసయి వెంటనే ఉద్యోగం దొరికి చేరిపోయాడు ఒక కంపెనీలో. వాడికి పెళ్ళి సంబంధాలు చూస్తారనుకున్నాను కానీ సూర్యనారాయణగారు గుర్తుంటారనుకోలేదు. చలపతి బాగుంటాడు, చదువుకున్నాడు, మంచి ఉద్యోగంలో ఉన్నాడు. అందరూ వాణ్ణే అదృష్టవంతుడు అంటున్నారు కానీ నేను అప్పుడే వాణ్ణే అదృష్టవంతుడు అనటానికి ఒప్పుకోను. ఎక్కువ అందం లేకపోయినా అనుకూలవతి అయిన భార్య వస్తేనే వాడు అదృష్టవంతుడు. భార్యా భర్తలిద్దరూ ఏ తెరలూ, అడుగోడలూ లేకుండా కలిసిపోతే, అప్పుడు వాడు నిజంగా అదృష్టవంతుడు అంటాను. మంచి భార్య కాకపోతే అంత రూపం, అంత విద్యా, అంత ఉద్యోగం, సంపాదన అన్నీ వ్యర్థమైపోయినట్లే. మగవాడి కింక జీవితంలో సుఖం ఉండదు.

రాధ గుర్తు వస్తోంది ఉత్తరం చదివినప్పటి నుంచి. నిజానికి సూర్యనారాయణగారు చాలా మంచిమనిషి. మర్యాద ఇవ్వటం, పుచ్చుకోవటం తెలుసు. బంధుప్రేమ ఉన్నవాడు. ముగ్గురే పిల్లలు, ముద్దూ ముచ్చట తీర్చగలవాడే కానీ బీదవాడు కాదు. నిజానికి మంచి సంబంధమే వాళ్ళది. చలపతికి బాగా కట్నం ఇస్తామని సంబంధాలు రావచ్చు కానీ నాన్నగారికి సంప్రదాయం, పిల్ల గుణం ముఖ్యం. అవి నచ్చితే కట్నానికి బేరమాడరు.

ఇందిరని అందువల్లనే నేను చేసుకోగలిగాను.

ఇప్పుడు నేను నాన్నగారికి ఏమని రాయటం?

వాళ్ళు మంచిపెద్దలు నాకు బాగా తెలుసు అని నన్ను అడుగుతున్నారు.

అన్నీ బాగున్నా రాధ కళ్ళు, రెప్పలు బరువుగా వాలిపోయే ఆ కళ్ళు నన్ను సంకోచంలో పడేస్తున్నాయి. ఆ కళ్ళవే చూస్తూ నిలబడిన ఆ అబ్బాయి కూడా వెంటవెంటనే గుర్తువస్తున్నాడు.

వాళ్ళ సంబంధం వొద్దు అని రాసెయ్యాలని మనసులో తొందర పుడుతోంది. ఇంకో పక్క నిజానిజాలు నాకు తెలీదు. నిజంగా నేను చూడకూడనిదేమీ చూడనూలేదు. నిష్కారణంగా రాధ మీద అనుమానపడుతున్నా నేమో అనే ఆలోచన కూడా వేధిస్తోంది.

చివరికి పెళ్ళి విషయంలో అనుమానాలు పనికిరావని నిశ్చయానికి వచ్చాను. ఇంక ఆడపిల్లలే లేరా. తొందర పడి ఈ రాధని చేసుకోవటం ఎందుకూ అనుకున్నాను చివరికి. నా అనుమానం ఇందుకి కూడా చెప్పలేదు. ఉత్త పుణ్యానికి ఒక ఆడపిల్ల మీద ఋజువు లేని అపవాదు వెయ్యటానికి నాకు నోరు రాలేదు. రాధ అదృష్టానికి అడ్డు పడి అన్యాయం చేస్తున్నానేమో అని నాకు అనిపించినా చివరికి నాన్నగారికి ఉత్తరం రాసేశాను. చలపతికి ఇంకో సంబంధం చూడండి. ఈ సంబంధం వద్దు అని. నాన్నగారికి నా మాటమీద నమ్మకం ఉంది. కారణాలు రాయక్కరలేదు.

* * * *

చలపతికి సంబంధాలు వస్తున్నాయి. ఇంకా పెళ్ళి నిశ్చయం కాలేదు. ఈలోగా రాధ పెళ్ళి నిశ్చయమైపోవటం, పెళ్ళి జరగటం కూడా అయిపోయింది. నేనూ, ఇందిరా, బేబీ వెళ్ళాం పెళ్ళికి. రెండు రోజులు వాళ్ళింట్లోనే భోజనాలు. సూర్యనారాయణగారు రాధకి మంచి వరుణ్ణే తెచ్చారు. ఎనిమిది వేలు కట్నం ఇచ్చారు. అబ్బాయి మెడికల్ రిప్రజెంటేటివ్. చూడటానికి సరదాగా, సోషల్‌గా, అధునాతనంగా ఉన్నాడు. మాట, తీరు, మంచివాడనే అనిపించింది. పెళ్ళిలోనే రాధా, అతనూ సరదాగా మాట్లాడుకున్నారు. అందరూ ఈడూ—జోడూ బాగుందన్నారు. పెళ్ళికొడుకు నాకూ నచ్చాడు. అతడు మోసపోకూడదు. వైవాహిక జీవితం సుఖంగా గడవాలి అని మనసులోనే ఆశీర్వదించాను.

* * * *

ఇంకో మూడు నెల్లకే చలపతి పెళ్ళి నిశ్చయమైందని ఉత్తరం వచ్చింది.

శుభలేఖ అందుకుని, సెలవు పెట్టి, ఇందునీ బేబీని తీసుకుని పెళ్ళికి వెళ్ళాను.

''పిల్ల బాగానే ఉంటుంది. వాళ్ళంతట వాళ్ళే పది వేలు కట్నం ఇస్తామన్నారు. నాలుగు వేల బంగారం పిల్లకి పెట్టి మిగతా దానితో లాంచనాలు జరిపించమన్నాం.'' అంది అమ్మ.

''ఏం చదివింది?'' అని అడిగింది ఇందిర.

''బి.ఎ. పాసయింది'' అంది అమ్మ. పేరు శశికళట.

పెళ్ళి సరదాగా బాగానే జరిగింది. శశికళని చూస్తున్నంత సేపూ నాకు రాధ గుర్తు వస్తూనే ఉంది. పొద్దున్న పెళ్ళి అయింది. ఉపోషం ఉండటం వల్ల, పొగ వల్ల కాబోలు పెళ్ళికూతురికి తల నొప్పిగా ఉందన్నారు.

సాయంత్రం అందరూ సినిమాకి వెళ్ళాం.. శశిని బతిమాలి తీసికెళ్ళాల్సి వచ్చింది.

''వొంట్లో బాగుండలేదు'' అంది.

''జ్వరం లేదు కదా. మళ్ళీ అందరం ఎప్పుడు కలుసుకుంటామో. రా!'' అని బతిమాలింది ఇందిర. చివరికి వచ్చింది. మనిషిలో ఉత్సాహం లేదు. రాధ గుర్తు వచ్చింది నాకు. ఎప్పుడూ సరదాగా ఉంటుంది. స్నేహితులతో సినిమాలకి, షికార్లకి తిరుగుతుంది. శశికి అట్లాంటి సరదాలు లేవా?

ఆ అమ్మాయి కళ్ళు అదొక రకంగా ఉన్నాయి. చూపులు ఎక్కడా నిలవ్వు. నువ్వు చూస్తుంటే నిన్ను చూస్తున్నట్లుండవు. ఎక్కడో ఏదో పోగొట్టుకున్నట్లు వెలితిగా ఉన్నాయనిపించింది.

ఇప్పుడింక చలపతి ఆనందమంతా ఆ అమ్మాయి ఆరోగ్యం మీద, స్వభావం మీద ఆధారపడి ఉంటుంది. చలపతికి నచ్చిందిట. తెల్లగా, సన్నగా పొడుగ్గా ఉంది. వాడికి నచ్చటమే కావాలి. వాళ్ళిద్దరూ సుఖంగా ఉండటమే కావాలి. రాధని వద్దన్నందుకు నేను పశ్చాత్తాప పడే స్థితి రాకుండా ఉండాలి.

* * * *

వాళ్ళ కంపెనీ పని మీద హైదరాబాద్ వచ్చాడు, చలపతి.

చూస్తూనే ఆశ్చర్యపడ్డాను. ఏదో దీర్ఘవ్యాధి పీడిస్తుంటేనే కానీ మనుషులు అట్లాగ చిక్కిపోరు. నల్లబడి, సన్నగా ఉన్నాడు. కళ్ళు గుంటలు పడ్డాయి. లెక్కపెట్టాను... పెళ్ళయి నాలుగు నెలలయింది.

''ఏవిట్రా ఇల్లాగయిపోయావు'' అన్నాను.

నవ్వి ఊరుకున్నాడు. కానీ ఇందు ఊరుకోలేదు.

వొంట్లో బాగుందా? డ్యాక్టర్‌కి చూపించుకున్నావా? శశికి వంట చెయ్యటం వచ్చా? శశి వొంట్లో కులాసాగా ఉందా?'' అని ఒకటే ప్రశ్నలు.

నిక్షేపం లాంటి కుర్రాడు ఇట్లాగయిపోయా డని తెగ బాధ పడిపోతోంది.

''నాకేం బాగానే ఉన్నాను వదినా! శశి చదువుకుంటోంది. యమ్మే చేస్తోంది'' అని చెప్పాడు.

''చదువుకున్నది చాలదూ. ఉద్యోగం చెయ్యాలేమిటి? నువ్వు సంపాదిస్తున్నది చాలదూ. చదువు పేరుతో నిన్ను నిర్లక్ష్యం చేస్తోంది కాబోలు!'' అంది.

''అదికాదులే వదినా, తరువాత చెప్తాను'' అన్నాడు.

అంటే ఏదో ఉందన్నమాట. ఇద్దరికీ పడటంలేదా? శశి గర్విష్ఠి మనిషా? లేకపోతే మనుషు లిలా గాలి తీసేసినట్లు చిక్కిపోరు.

వాడికేదో సమస్య ఉందన్నమాట. ఏమిటో అది! ఎప్పుడు చెప్తాడో అడిగితే బాగుండదు. ఎదురు చూస్తున్నాను ఆత్రుతగా.

రాత్రి భోజనాలు అయ్యాయి. కంపెనీ పని చూసుకుని చీకటి పడ్డాక ఇంటికి వచ్చాడు చలపతి. రాగానే భోజనం చేశాం. చలపతికి ఇష్టమని బంగాళ దుంపలు ఉల్లికారం కూర చేసింది ఇందు.

తను కూడా భోజనం చేసి వచ్చి వక్కపొడి అందించింది. తను కూడా ఇంకో కుర్చీలో కూర్చుని—

''ఇప్పుడు చెప్పు,'' అంది.

''ఇప్పటి దాకా ఎవరికి చెప్పలేదు. అమ్మకి, నాన్నగారికి కూడా తెలీదు. శశి చదువుకుంటోందని మాత్రమే చెప్పాను,'' అని ఆగాడు చలపతి. నేనూ, ఇందూ ఏమీ అనలేదు. ఇంకా ఏం చెప్తాడో అని చూస్తున్నాం.

''పెళ్ళిలోనే వంట్లో బాగుండలేదు కదా ఆ అమ్మాయికి. మన ఇంట్లో ఉన్న మూడు రోజులూ జ్వరమే. ఫ్లూ వచ్చింది. వెంటనే వాళ్ళింటికి వెళ్ళిపోయింది. మళ్ళీ నెలకి రెండు రోజులు సెలవ తీసుకుని వెళ్ళాను. అక్కడ రెండు రోజులుండి, శశిని వెంట తెచ్చుకుందామనుకున్నాను.

ఆ రోజు రాత్రి బాగుందన్నారు. మంచి ముహూర్తం ఉందన్నారు. పిండి వంటలు చేశారు. మర్యాదలు చేశారు. రోజంతా చాలా త్వరగా గడచిపోయింది.

రాత్రి భోజనాలయ్యాయి. తాంబూలం వేసుకుని నా గదిలోకి వచ్చాను.

అగరొత్తులు వెలిగించారు. పక్క మీద తెల్ల దుప్పటి వేశారు. శశి ఎప్పుడు వస్తుందా అని చూస్తున్నాను నేను. అట్లాగ చాలా సేపు గడిచింది.

తలుపు చప్పుడు విని వెనక్కి తిరిగి చూశాను. శశి లోపల నిలబడి ఉంది. ఏవరో బయట గొళ్ళెం పెడుతున్నారు.

ఒక నిమిషం అట్లాగే చూస్తూ నిలబడ్డాను.

శశి నా వైపు చూడలేదు. తల వంచుకోనూ లేదు. ఏటో చూస్తోంది. దగ్గరగా వెళ్ళాను. భుజంమీద చెయ్యి వేయబోయాను. వెనక్కి జరిగింది. తరువాత ఏమయిందో, నేనేమన్నానో నాకు గుర్తు లేదు. అవసరమూ లేదు. తనకి ఈ పెళ్ళి ఇష్టం లేదుట. ఏవరినో ప్రేమించిందిట. అతడికి పెళ్ళయిందిట. పిల్లలున్నారుట. మన కులంవాడు కాడుట.

మనసు లేనిదాన్ని ముట్టుకోటానికి అభిమానం లేకపోతే తన మీద చెయ్యి వెయ్యమంది, అంతే.

ఇంక మళ్ళీ మా మధ్య ఆ మాట లేదు. తను వండటం, నేను తినలేక కక్కలేక మింగటం, పనికి వెళ్ళటం, రావటం నిద్ర రాక, లేక గడపటం— అట్లా సాగుతోంది. నాకు అదీ బాగుండలేదు.

మీ ఇంటికి వెడతావా? అని అడిగాను. వెళ్ళనంది. ఏమ్మే చదువుకోమని హాస్టల్లో చేర్పించాను. రెండేళ్ళు చదువుకోనీ తరవాత తన ఇష్టం ఎటు వెళ్ళినా సరే. ఎవడిని వరించినా సరే'' అన్నాడు చలపతి, పేలవంగా నవ్వుతూ.

ఇందు ఒకటే ఆవేశపడుతోంది.

''బి.ఎ. చదివిందన్నారు. ఎట్లా చేసుకుందీ పెళ్ళి. ఇష్టం లేకుండా? తనకిష్టం లేదని చెప్పలేదూ? ఇంకో మనిషి జీవితం పాడవుతుందన్న జ్ఞానం లేదూ! ఇట్లా భార్య కాకుండా, ఇంకోడి మీద ఆధారపడటానికి అభిమానం లేదూ!'' అంది.

''ఇంకా మనవాళ్ళు బలవంతంగా పెళ్ళిళ్ళు చేస్తూనే ఉన్నారు వదినా. కట్నం పుచ్చుకొన్నానుగా. రెండేళ్ళు చదివిస్తే సరిపోతుంది,'' అన్నాడు.

''ఇదివరకు ఆడపిల్లకి అట్లా జరిగిందంటే ఒప్పుకుంటాను. ఇప్పుడు చదువుకుంటున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. ఇరవై ఏళ్ళు దాటుతున్నాయ్. మిగతా విషయాల్లో ప్రదర్శిస్తూన్న ధైర్యం, తెగింపు ఇప్పుడు ఏమైపోతున్నాయ్?

ఎటు వెళ్ళినా ఎవడిని వరించినా సరే అంటున్నావ్, మరి నీ సంగతి?'' అని ప్రశ్నించింది ఇందు.

''ఇది చాలు వదినా. ఈ ఒక్క అనుభవం చాలు.'' అన్నాడు.

ఔను ఆ మొహం, పీక్కుపోయిన దవడలు, గుంటలు పట్టిన కళ్ళూ చూస్తుంటేనే తెలుస్తోంది. ఆ పేలవమైన నవ్వే చెప్తోంది వాడి మనసు విరిగిపోయిందని.

* * * *

ఆ మర్నాడు పొద్దున్న వెళ్ళిపోటానికి సూట్‌కేస్ సర్దుకుంటున్నాడు. చలపతి. రాధ, భర్త వచ్చారు. వాళ్ళన్నయ్య పెళ్ళిట, పిలవటానికి వచ్చింది.

''అమ్మకి తీరుబడి లేదని నేనే బయలుదేరాను పిలుపులకి'' అంది.

పెళ్ళయ్యాక రాధ ఇంకా బాగుంది. చూపులు అట్లాగే ఉన్నాయ్.

''పూలు జారిపోతున్నాయి రాధా,'' అన్నాడు రాధ భర్త.

''మీ కెప్పుడూ నా సంగతే కావాలి. పడిపోవులెండి,'' అంది అతడివేపు నవ్వుతూ వాలిపోయే చూపులతో బరువుగా చూస్తూ.

వాళ్ళు ఉన్నంతసేపూ చలపతి రాధనే చూస్తున్నాడు. వెళ్ళాక అడిగాడు ''ఎవరు?'' అని.

''తెలిసినవాళ్ళు'' అని చెప్పి ఊరుకున్నాను.

సూర్యనారాయణగారి అమ్మాయి రాధ అని చెప్పటానికి భయం వేసింది, వాడి కళ్ళలో మెచ్చుకోలు చూసి.

రాధ, రాధ భర్తా బాగానే ఉన్నారు. అనురాగంగానే ఉన్నారు.

రాధకి రహస్యాలు ఏమీ లేవా? లేక భర్తకి తెలీకుండా జాగ్రత్త పడిందా? ఆ మత్తుగా వాలిపోయే కళ్ళతో భార్య తనని చూస్తే ఫరవాలేదు...

కానీ కనిపించిన ప్రతివాడినీ అవే చూపులు చూస్తుంటే...

అతడికి బాగుందేమో కానీ నేను భరించలేను.

అందుకే చలపతికి ఒద్దు అనుకున్నాను.

చలపతి రాధని చూసి ఉంటే చేసుకుంటా ననేవాడా? పట్టు పట్టేవాడా? సుఖపడేవాడేమో! రాధా, రాధ భర్తా మధ్య అనురాగం నిజమైనదేనా? ఆ రోజు రాధ మాట్లాడిన అబ్బాయి!? ఈ వాలు చూపులు కాకతాళీయమేనా! నా

అనుమానాలకి ఆధారంలేదూ.

చలపతి వెళ్ళిపోయాడు. ఎదుట ఆ పిల్ల లేకపోయినా ఇందు ఒకటే సాధిస్తోంది శశిని పేరుపెట్టి.

''బొత్తిగా అజ్ఞానురాలు. ఎందుకూ పనికిరాదు. ఎంతసేపూ తన గురించేనా, స్వార్థమేనా చూసుకోవటం. ఎదుటివాడూ మనిషే అని జ్ఞానం ఉండాలా! చదువుకుందిట ఎందుకూ, తను చెడిపోయి అందరి బతుకులూ నాశనం చెయ్యటానికి. ప్రేమిస్తే ప్రేమించింది. చిన్నతనం, తెలీక! పెళ్ళయ్యాక కూడా అదే పాట పాడాలా? అంత మరిచి పోలేకపోతే పెళ్ళెందుకు చేసుకోవాలి! బ్రహ్మచారిణిగా ఉండలేకపోయిందా!'' ఇందు తన బాధ పైకి వెళ్ళబోసుకుంటుంది.

నేను బాధ తెలీకుండా ఆలోచనల సుడిగుండంలో కొట్టుకుంటున్నాను. నాకు శశికళ కళ్ళుకూడా నచ్చలేదు. ఎదుటి మనిషి గుర్తించకుండా ఎక్కడో శూన్యంలో వెతుక్కునే కళ్ళు. ఏదో వెలితిని వ్యక్తం చేసే చూపులు. పెళ్ళికి ముందరే ఆ పిల్లని చూసి ఉంటే... మాత్రం నేనేం చెయ్యగలను! ఇప్పుడు చంపతి మనసు విరిగిపోయింది. ఒక్క మాటతో వాడి అభిమానం మీద దెబ్బ తీసిందా అమ్మాయి. శశిని తన వేపు తిప్పుకునే ప్రయత్నం కూడా చెయ్యటంలేదు వాడు. వాడికా ఉద్దేశమే లేదు. ఒకసారి కలిసిన మనసులు ఒక వేళ విడివడినా మళ్ళీ కలిసే అవకాశం ఉంది.

వీడికి ఆ అవకాశం కూడా లేదు. ఆ అమ్మాయి అంటే అనురాగం, ఆకర్షణ, అభిమానం ఏమీ ఏర్పడలేదు ఒక్క వివాహబంధం తప్ప.

ఒక వేళ శశి మనసు మార్చుకుంటే మాత్రం వీడు వింటాడా?

రాధని చేసుకుంటే సుఖపడేవాడేమో. రాధ, రాధ భర్త నిజంగా సఖ్యంగా ఉన్నారా? వెలితి చూపులకంటే, రహస్యాల్ని దాచుకోగల వాలు చూపులే నయమేమో. రాధను చేసుకోవద్దని చెప్పినందుకు పశ్చాత్తాపపడే పరిస్థితి రాకూడదని అప్పుడు కోరుకున్నాను.

కానీ ఇప్పుడు పశ్చాత్తాప పడాలో అక్కరలేదో కూడా నాకు తెలీటంలేదు.

* * * *